www.prajapathrika.in

# ప్రజా పత్రిక

తెలుగు దినపత్రిక

సోమవారం 07 జూలై 2025

సంపుటి : 01 సంచిక : 25 పేజీలు : 4 Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda



లక్కీ భాస్కర్ కు సీక్వెల్

4



వెంకీ సరసన ఆ క్రేజీ బ్యూటీ..?

## సమాజానికి విద్య, వైద్యం రెండు కళ్ల లాంటివి

: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



2 లో

## స్విచ్ఛాఫ్ మోడ్‌లో సర్కార్

●నీటి విలువ తెలియని వాళ్లు పాలనలో ఉన్నారు ● కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమిస్తాం ● మేడిగడ్డలో నీరు ఉండి కూడా రైతులకు అందకుండా.. ప్రభుత్వం నిర్లక్ష్యం ● ప్రభుత్వ నిర్లక్ష్యం నేరపూరిత చర్య ●కన్నెపల్లి, కల్వకుర్తి మోటార్లు ఆన్ చేయకపోతే ఉద్యమం తప్పదు -హరీశ్ రావు



2 లో

తెలంగాణ సర్కార్ స్విచ్ఛాఫ్ మోడ్‌లో బీఆర్ఎస్ ముఖ్య నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఆదివారం ఆయన హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, తెలంగాణలో మాత్రం వర్షాభావ పరిస్థితులు నెలకొనడం దురదృష్టకరమని అన్నారు. సాధారణంగా కృష్ణాలోని జూలై, ఆగస్టు చివరన వరదనీరు వస్తుందని.. కానీ, అనూహ్యంగా మే నెలలోనే కృష్ణాకు వరద నీరు రావడంతో రెండు పంటలకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉందన్నారు.

ఎక్కడికక్కడ మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లు, చెరువు, చెక్‌డ్యాంలు, చెరువులు, కుంటలు నింపుకునేందుకు చక్కని అవకాశం ఉందని అన్నారు. కానీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వమేమో స్విచ్ఛాఫ్ మోడ్‌లో ఉందని కామెంట్ చేశారు. ముఖ్యమంత్రి అయినా.. మంత్రులైనా బీఆర్ఎస్ మీద నిత్యం బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని.. నిందలు వేయడంలో బిజీగా ఉన్నారని సెటైర్లు వేశారు. వరద నీటిని ఎత్తిపోసుకునేందుకు ఎవరికీ కనీస శ్రద్ధ, పట్టింపు లేదని హరీశ్ ధ్వజమెత్తారు. మోటార్లు ఆన్ చేయకపోవడానికి కారణం ఏంది.. కరువును పారదోలే కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ మీద కక్ష, కడుపు మంటతో వద్దనుకుంటోందని ఆరోపించారు.

బీఆర్ఎస్ పార్టీ మీద కోపం ఉంటే.. తమ మీద పగ తీర్చుకోవాలని, రాష్ట్రంలోని రైతులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. నీళ్ల విలువ తెలిసినోళ్లు ముఖ్యమంత్రిగా ఉంటే.. ఆ నీళ్లను మలుపుకునే ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకునే వారని అన్నారు, రాష్ట్రంలోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి నెల దాటిందని.. కానీ, ఇప్పటికీ మోటార్లు ఆన్ చేయకపోవడానికి కారణం ఏంటో చెప్పాలన్నారు. కళ్ల ముందు నీళ్లు పోతున్నా.. పట్టించుకోకపోవడాన్ని నేరపూరిత నిర్లక్ష్యమేనని ఫైర్ అయ్యారు. మేడిగడ్డ వద్ద ఇప్పుడు 73 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందని తెలిపారు.

## మాంసం తినేవారిని పార్టీలోకి తీసుకోవద్దు అంటే ఎలా..

\- కొండా విశ్వేశ్వర్ రెడ్డి



2 లో

బిజెపి పార్టీ రాజకీయ పార్టీ కానే కాదని.. కొందరు దేశభక్తి అంటారని, తమ వ్యక్తిగత స్వార్థం తో పార్టీని బలహీనం చేస్తున్నారని బిజెపి నాయకులు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ రిబ్బన్ కట్ చేసి నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కొందరు దేశభక్తిని అడ్డం పెట్టుకొని జిల్లాలో పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మీకు దేశభక్తి ఉంటే ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్ లో చేరి దేశానికి సేవ చేయాలని, అంతే కానీ బీజేపీ లాంటి రాజకీయ పార్టీలో కొనసాగే అర్హత మీకు లేదని అన్నారు. అలాంటి వ్యక్తిత్వం, స్వార్థం ఉన్నవారు బిజెపి పార్టీలో ఉండరాదని స్పష్టం చేశారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ళు : మంత్రి పొంగులేటి



2 లో

రాష్ట్ర ప్రజలకు మరో గుడ్ న్యూస్. రాష్ట్రంలోని అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్ళు అందజేస్తామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. కొత్తగూడెంలో నేడు జరిగిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ళు అందిస్తామని వెల్లడించారు. ఇప్పటికే 2.50 లక్షల ఇళ్ళ పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

## ప్రజల స్వేచ్ఛ కోసం..

## అమెరికాలో మస్క్ కొత్త రాజకీయ పార్టీ



2 లో

అగ్రరాజ్యం అమెరికాలో మరో కొత్త పార్టీ అవతరించింది. రిపబ్లికన్, డెమొక్రాట్లకు ప్రత్యామ్నాయంగా మూడో రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. అపర కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ నూతన రాజకీయ పార్టీని ఏర్పాటుచేశారు. ట్రంప్ కలల బిల్లు అయిన 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు'ను ఆమోదించిన మరుక్షణమే తాను రాజకీయ పార్టీని ఏర్పాట్లు చేస్తానని మస్క్ ప్రకటించిన విషయం తెలిసిందే. బిగ్ బ్యూటీఫుల్ బిల్లును అమెరికా ఉభయ సభలు ఆమోదించడం, ట్రంప్ ఆ బిల్లుపై సంతకం చేయడం, అది చట్టం రూపం దాల్చడం జరిగిపోయాయి. దీంతో 'ది అమెరికా పార్టీ' ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

## రైతులను రోడ్డెక్కించిన కాంగ్రెస్ సర్కార్..

●ఇది నో స్టాక్ సర్కార్ ●యూరియా కోసం క్యూ లైన్లలో రైతులు ● ఖమ్మంలో ముగ్గురు మంత్రులున్నా రైతులకు నరకయాతన ●ఎరువుల కొరత, బ్లాక్ మార్కెట్‌పై కవిత హెచ్చరిక ●పదేళ్ల తర్వాత రైతు మళ్లీ రోడ్డు మీద -ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



2 లో

## పేదల ఇంటి కలకు బాసటగా ఇందిరమ్మ ఇళ్లు

●మొదటి ఏడాదిలోనే రూ.22,500 కోట్లు - ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ భారీ కేటాయింపు ● ఒక మనసున్న ప్రభుత్వం ఎలా ఉండాలో చూపిస్తున్నాం ●ఇళ్ల కలను సాకారం చేస్తూ.. మధిరలో లబ్ధిదారులకు మంజూరు పత్రాల అందజేత ●93 లక్షల కుటుంబాలకు సంక్షేమ పథకాలు - కాంగ్రెస్ పాలనపై భట్టి విక్రమార్క



2 లో

## మోదీ ప్రభుత్వం విద్వేషాలని రెచ్చగొడుతోంది..



●రాష్ట్రం నుంచి 8 బీజేపీ ఎంపీలు ఉన్నా.. నిధులకోసం ఏమి చేశారు? ●రాంచందర్ రావు లేఖపై మండిపడ్డ పొన్నం.. ముందుగా మోదీకి లేఖ రాయండి ●పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచిన వారే మీరు కాదా? ●ప్రజలను వంచిస్తూ.. ఒట్టి లేఖలు రాయడం నీచ రాజకీయమే - పొన్నం ప్రభాకర్

2 లో

## కొనసాగుతున్న సిగాచీ మృతుల వేట

### 42కు చేరిన మృతుల సంఖ్య

సిగాచీ పేలుడు ఘటనలో ఇప్పటి వరకు ఆచూకీ దొరకని మృతుల వేట కొనసాగుతోంది. ఇటీవల సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో ఉన్న సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో భారీ పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 42 మంది మృతి చెందగా మరో 9 మంది కార్మికుల జాడ తెలియరాలేదు.



2 లో

## ఆ బ్లాక్ మార్కెట్ దందా ఎవరూ నడిపిస్తున్నారో తెలియాలి

### కేటీఆర్ హాట్ కామెంట్స్

రైతు సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు భరోసా లేదు.. రైతు రుణమాఫీ లేదని మండిపడ్డారు. కనీసం అప్పు తెచ్చి వ్యవసాయం చేద్దామంటే ఆఖరికి ఎరువులకు కూడా కరువు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా రైతు సమస్యలపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు.



2 లో

## ఏపీ మంత్రి నారా లోకేష్‌తో కేటీఆర్ రహస్య మంతనాలు

●సంచలన ఆరోపణలు చేసిన టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి

● ఎవరికి లాభం కోసం రహస్య మంతనాలు?

●తెలంగాణకు వ్యతిరేక కుట్రలేనా?

● లోకేష్‌ను కలవలేదంటే వివరాలు బయటపెడతా

● రైతుల విషయంలో నైతిక హక్కు లేదు - కేటీఆర్‌పై కాంగ్రెస్ నేత ఘాటు విమర్శలు



2 లో

www.prajapathrika.in
ప్రజా పత్రిక
తెలుగు దినపత్రిక
సోమవారం 07 జులై 2025

# సమాజానికి విద్య, వైద్యం రెండు కళ్ల లాంటివి

విద్య , వైద్యం సమాజానికి రెండు కళ్ల వంటివని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. 2024-2025 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో మొదటి స్థానం ద్వితీయ స్థానం తృతీయ స్థానం సాధించిన విద్యార్థులకు సన్మానం, నగదు బహుమతి, ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజానికి విద్య, వైద్యం రెండు కళ్ల వంటివని, వాటిని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు 10 రెట్లు ఎక్కువ ఖర్చు చేస్తోందని తెలిపారు.

అందులో భాగంగా, మునుగోడు నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ స్కూల్ ద్వారా ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, విద్యార్థులకు ఉన్నత విద్యా సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. ఈ పాఠశాల నిర్మాణం మునుగోడు ప్రాంతంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు, పేద విద్యార్థులకు మెరుగైన అవకాశాలను కల్పించనుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు 20 లక్షల రూపాయల నగదు బహుమతులతో సన్మానించే వినూత్న కార్యక్రమాన్ని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేపట్టారు. ఈ సందర్భంగా.. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా 62 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 189 విద్యార్థినీ విద్యార్థులను సన్మానించి, ప్రతిభ పురస్కారంతోపాటు నగదు బహుమతిని ఎమ్మెల్యే కోమటిరెడ్డి అందజేశారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ళు : మంత్రి పొంగులేటి

మొదటి పేజీ తరువాయి

అర్హులైనప్పటికీ ఇళ్ళు మంజూరు కాని వాళ్ళు బాధ పడవద్దని సూచించారు. రోబోయే రోజుల్లో మిగతా లబ్ధిదారులకు కూడా విడతల వారిగా ఇళ్ళు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ కట్టు కథలు నమ్మి మోసపోవద్దని, 10 ఏళ్ల కాలం వారి మాటలు నమ్మి దగా పడింది చాలన్నారు. తెలంగాణలో రైతుల, నిరుపేదల సంక్షేమం కోరేది కేవలం ఇందిరమ్మ రాజ్యమేనని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## ఆ బ్లాక్ మార్కెట్ దందా ఎవరూ నడిపిస్తున్నారో తెలియాలి.. కేటీఆర్ హాట్ కామెంట్స్

మొదటి పేజీ తరువాయి

రేవంత్ ప్రభుత్వం అడిగినట్లుగా రైతులు ఆధార్ కార్డులు ఇచ్చినా, వారికి కనీసం బస్తా ఎరువు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఎందుకుందని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల లోటు ఎందుకుందో రైతులకు రేవంత్ ప్రభుత్వం వివరించాలని కోరారు. రూ.266.50 ఉండాల్సిన బస్తా యూరియా ధర ఇప్పుడు రూ.325 ఎలా అయ్యిందో రైతులకే కాదు, రాష్ట్ర ప్రజలకు మొత్తం తెలియాలని నిలదీశారు. ఈ బ్లాక్ మార్కెట్ దందాను దగ్గరుండి నడిపిస్తోంది ఎవరని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ కృత్రిమ కొరత ఎవరివల్ల ఏర్పడుతుందో చెప్పాలని అన్నారు. ఆఖరికి ఎరువులను కూడా బుక్కేస్తున్న మెతన్నలు ఎవరో వెంటనే రేవంత్ ప్రభుత్వం విచారణ జరిపించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు.

# స్విచ్ఛాఫ్ మోడ్‌లో సర్కార్

మొదటి పేజీ తరువాయి

ఆ ప్రాజెక్ట్ మొత్తం గేట్లు తెరచి ఉన్నా.. కన్నేపల్లి పంప్ హౌస్ నుంచి మోటార్లు ఆన్ చేసి నీళ్లు తీసుకునే అవకాశం ఉందన్నారు. అన్నారం , సుందిళ్ల బ్యారేజీలు సేఫ్ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డే చెప్పారని.. మరి నీళ్లు ఎత్తిపోయడానికి ప్రభుత్వానికి ఉన్న ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. ఆ నీటితో 15 జిల్లాల్లోని లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే అవకాశం ఉందని అన్నారు. ఇక ఆలస్యం చేస్తే ఊరుకోబోమని. లక్షలాది మంది రైతులతో కన్నేపల్లికి కదిలి మోటార్లు ఆన్ చేస్తామని హరీష్ రావు వార్నింగ్ ఇచ్చారు.

## పాలమూరు రైతులను మోసం చేసే కుట్ర జరుగుతోంది: మంత్రి ఉత్తమ్?




పాలమూరు రైతులను మోసం చేసే కుట్ర జరుగుతోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి లిఫ్ట్ ఎప్పుడు ఆన్ చేయాలో తమకు తెలుసని చెప్పారు. కుంగే బ్యారేజీలకు నీళ్లు ఎత్తిపోయాలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు బాగుంటే ఓర్వలేకపోతున్నారా అని నిలదీశారు. నిరంతరం రాష్ట్రంలో రైతులను మోసం చేయాలని, రైతులను ఆందోళనకు గురి చేయాలని బీఆర్ఎస్ కుట్రలకు పాల్పడుతోందన్నారు. కుట్రపూరితమైన అబద్ధాలు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. అబద్ధాలను గోబెల్స్‌కు మించి ప్రచారం చేయటం మాజీ మంత్రి హరీష్ రావుకు అలవాటైపోయిందని ఎద్దేవా చేశారు. పంట వేసేటప్పుడు రైతులను ఆదుకునే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానిది. ప్రతి పంట సీజన్లో రైతులను ఆందోళనకు గురి చేసి, గందరగోళపరచాలనే దుర్బుద్ధి బీఆర్ఎస్ నేతలదని చెప్పారు. నిరుడు వానాకాలంతో పాటు ఇటీవలి యాసంగిలో భారతదేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రైతులు రికార్డు స్థాయిలో వరి పంట సాగు చేశారని తెలిపారు. ఆ విషయాన్ని మరిచిపోయి హరీష్ రావు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు. యాసంగి సీజన్‌కు ముందు కూడా బీఆర్ఎస్ ఇలాంటి అబద్ధాలు మాట్లాడిందని చెప్పారు. రైతులోకాన్ని ఆందోళనకు గురి చేయాలని అప్పుడు కూడా కుటిల ప్రయత్నాలు చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.

గత వానాకాలంలో రాష్ట్రంలోని రైతులు 66.7 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేసి 153.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. యాసంగిలో 60 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తే.. 130 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించిన ఘనత తెలంగాణ రైతులదని తెలిపారు. దేశ చరిత్రలోనే ఒకే ఏడాదిలో 283 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సాధించిన రికార్డు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాధ్యమైందన్నారు. తెలంగాణ రైతులు దేశానికి ఆదర్శంగా నిలిస్తే ఓర్వలేని గుణం బీఆర్ఎస్ లీడర్లదన్నారు. పదేండ్లలో తాము చేసిన తప్పులు, దుర్మార్గాలకు ప్రజలకు క్షమాపణలు చెప్పాల్సింది పోయి.. మేడిగడ్డ, కల్వకుర్తి అంటూ ఇప్పటికీ రైతులను మోసం చేయాలని చూస్తున్నారని మంత్రి ఉత్తమ్?కుమార్?రెడ్డి మండిపడ్డారు.

“బీఆర్ఎస్ అసమర్థత, నిర్లక్ష్యం, నిర్వాకం కారణంగానే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా ఇప్పటికీ ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాయి. సీకెంట్ ఫైల్స్ టెక్నాలజీతో మేడిగడ్డ నిర్మాణం చేపట్టిన విషయాన్ని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తప్పు బట్టింది. మేడిగడ్డ మాదిరిగానే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను అదే సీకెంట్ ఫైల్స్ ఫౌండేషన్ టెక్నాలజీతో నిర్మించటంతో ప్రమాదకరంగా మారాయి. అవి అక్కరకు రాని పరిస్థితిలోనే ఉన్నాయి.” అని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ఏపీ మంత్రి నారా లోకేష్‌తో కేటీఆర్ రహస్య మంతనాలు

ఏపీ మంత్రి నారా లోకేష్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ రహస్య మంతనాలు జరుపుతున్నారని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం.. గోదావరి, కృష్ణాలో తెలంగాణ వాటా కోసం పోరాటం చేస్తుంటే, బనకచర్ల ప్రాజెక్టు ఆపేందుకు ప్రయత్నాలు చేస్తుంటే మాజీ మంత్రి కేటీఆర్ మాత్రం ఏపీ మంత్రి నారా లోకేష్‌తో సీక్రెట్ మీటింగ్స్ జరిపారని సంచలన వ్యాఖ్యలు చేశారు. నారా లోకేష్‌తో కేటీఆర్ రెండు సార్లు మంతనాలు జరిపారని ఆరోపించారు. ఆ రహస్య మంతనాలు ఎందుకు చేశారో.. ఎవరికి లబ్ధి చేయడానికి చేశారో కేటీఆర్ సమాధానం చెప్పాలని సామ రామ్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు.

ఈ విషయంపై కేటీఆర్ స్పందించాలని, లోకేష్‌ను కలవలేదంటే అప్పుడు తాను వివరాలు బయటపెడతానని షాకింగ్ కామెంట్స్ చేశారు. తెరవెనక తెలంగాణ రాష్ట్రంకు కుట్రలు చేస్తుంది ఎవరో వీరి భేటితో అర్థం అవుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌కి కేటీఆర్ ప్రతిసవాళ్లు విసురుతున్నారని..అయితే, అన్ని అంశాలపై సోమవారం అమరవీరుల స్థూపం వద్దకు చర్చకు రావాలని సవాల్ విసిరారు. గత ప్రభుత్వంలో ఉన్నప్పుడు నష్టం కలిగి రైతులు చనిపోతే కనీసం పట్టించుకోలేదని, అలాంటిది ఇప్పుడు రైతుల సంక్షేమం గురించి మాట్లాడేందుకు సిగ్గు ఉండాలని కేటీఆర్‌పై సామ రామ్మోహన్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు.

## కొనసాగుతున్న సిగాచీ మృతుల వేట.. 42కు చేరిన మృతుల సంఖ్య



సిగాచీ పేలుడు ఘటనలో ఇప్పటి వరకు ఆచూకీ దొరకని మృతుల వేట కొనసాగుతోంది. ఇటీవల సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో ఉన్న సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో భారీ పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 42 మంది మృతి చెందగా మరో 9 మంది కార్మికుల జాడ తెలియరాలేదు. వీరి కోసం ప్రమాద స్థలంలో శిథిలాల కింద చిక్కుకున్న కార్మికుల అవశేషాల కోసం అన్వేషణ కొనసాగుతోంది. అయితే శరీర అవశేషాలు భూమిలో కలిసిపోయినట్లు అధికారులు భావిస్తున్నారు.

పురావస్తు శాఖ టెక్నిక్ తరహా ఉపయోగించి తవ్వకాలు జరుపుతున్నారు అధికారులు. ఈ ప్రక్రియలో వెంట్రుకలు, మాంసం ముద్దలు, ఎముకలు, రక్తం మరకలతో ఉన్న రాళ్లు, కార్మికుల వస్తువులు లభ్యమవుతున్నాయి. ఇప్పటివరకు 70కి పైగా శాంపిల్స్ సేకరించగా, వాటి గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్షలకు పంపించారు. బాధిత కుటుంబాలు తమ వారి ఆచూకీ కోసం ఆవేదనతో ఎదురుచూస్తున్నారు.

## రైతులను రోడ్డెక్కించిన కాంగ్రెస్ సర్కార్..

తెలంగాణలో పలు ప్రాంతాల్లో వ్యవసాయ మార్కెట్ల వద్ద యూరియా కోసం రైతులు తడిసిమోసిన జల్లులా క్యూ లైన్‌లో నిలబడుతున్నారు. ఈ పరిస్థితిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు.

ఆదివారం ఆమె ఎక్స్ వేదికగా మాట్లాడుతూ, “ఇది నో స్టాక్ సర్కార్. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాజుగా ఉన్న రైతు, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మళ్లీ రోడ్డు మీద పడిపోయాడు,” అంటూ వ్యాఖ్యానించారు. రైతులకు ఎరువులు, విత్తనాల కొరత తీరక.. పోలీస్ స్టేషన్లలోనే వాటిని అమ్మిన దశకి ప్రభుత్వం చేరుకుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

యూరియాతోపాటు డీఏపీ, పొటాష్ వంటి ముఖ్యమైన ఎరువుల కోసం కూడా రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా అక్కడి రైతుల దుస్థితి ఇంకా దారుణంగా ఉందని విమర్శించారు.

వానాకాలం సీజన్ ప్రారంభమై నెలవుతున్నా సరైన ప్రణాళిక లేక, ముందు చూపుతో వ్యవహరించకపోవడం వల్లే రైతులు ఇలాంటి ఇబ్బందులు పడుతున్నారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువులను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయించే వారిని నియంత్రించకపోతే పరిస్థితి మరింత దిగజారుతుందని ఆమె హెచ్చరించారు.

# మాంసం తినేవారిని పార్టీలోకి తీసుకోవద్దు అంటే ఎలా..

### కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

బిజెపి పార్టీ రాజకీయ పార్టీ కానే కాదని.. కొందరు దేశభక్తి అంటారని, తమ వ్యక్తిగత స్వార్థం తో పార్టీని బలహీనం చేస్తున్నారని బిజెపి నాయకులు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ రిబ్బన్ కట్ చేసి నూతన



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కొందరు దేశభక్తిని అడ్డం పెట్టుకొని జిల్లాలో పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మీకు దేశభక్తి ఉంటే ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్ లో చేరి దేశానికి సేవ చేయాలని, అంతే కానీ బీజేపీ లాంటి రాజకీయ పార్టీలో కొనసాగే అర్హత మీకు లేదని అన్నారు. అలాంటి వ్యక్తిత్వం, స్వార్థం ఉన్నవారు బిజెపి పార్టీలో ఉండరాదని స్పష్టం చేశారు.

జిల్లాలోని బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు... స్థానిక బీఆర్ఎస్ పార్టీ, జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు లాగా గ్రౌండ్ లెవెల్ లో పనిచేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మంచితనం అంటారు, మాంసం తినేవారికి పార్టీలో స్థానం లేదు అంటారు. ఇలా అయితే పార్టీ బలోపేతం అవుతుందా..? దేశంలో మోదీ, జిల్లాలో నేను ఎలాగైనా గెలుస్తాం. దానివల్ల మీకు ఉపయోగం ఏంటి..? పార్టీలో జిల్లా అధ్యక్ష పదవులు, ఇతర నామినేటెడ్ పోస్టుల కోసం కోట్లాడడం కాదు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాకు జిల్లా నుండి 5000 వార్డు మెంబర్లు, 540 మంది సర్పంచ్ లు గెలిచి చూపించాలి. అందుకోసం పార్టీ ఇచ్చిన లక్ష్యాలను అధిగమించడానికి నేను సిద్ధంగా ఉన్నాను, సర్పంచ్ లు, వార్డు మెంబర్లు గా గెలవడానికి మీరు సిద్ధంగా ఉన్నారా..? అని నాయకులు, కార్యకర్తలను ఎంపీ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు సదానంద రెడ్డి, నాయకులు వడ్ల నందు, నవీన్ తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోదీ ప్రభుత్వం విద్వేషాలని రెచ్చగొడుతోంది..

కేంద్రం నుంచి ఏకాణా తేలేని వారు కూడా తమకు లేఖలు రాయడం విడ్డూరంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి కి బీజేపీ చీఫ్ రాంచందర్ రావు లేఖ రాయడంపై ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్, రాంచందర్ రావుకు ప్రతి లేఖ రాశారు. అందులో కేంద్రంలో నరేంద్ర మోడీ సర్కార్ మెగా ఫెయిల్యూర్స్ సంగతేంది రామచందర్ రావును ప్రశ్నించారు. 11 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ ప్రజలను అడుగడునా వంచిస్తోందని అన్నారు. గత మూడు ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీలను విస్మరించారని మండిపడ్డారు.

వాగ్దానాలతో ఊదరగొట్టడం, మత విద్వేషాన్ని రెచ్చగొట్టడం, అబద్ధాలను ఆవిష్కరించడం తప్ప బీజేపీ చేసిందేమి లేదన్నారు. రైతులు, యువకులు, మహిళలు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను వంచించిన చరిత్ర వారిదని ఆక్షేపించారు. 2019 పార్లమెంట్ ఎన్నికల మెనిఫెస్టోలో 60 ఏళ్లు దాటిన సన్నకారు రైతులకు పించన్లు ఇస్తామని అన్నారని.. ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. పంట పెట్టుబడి సాయం కోసం రైతులకు ఏడాదికి ఇచ్చే రూ.6 వేల కిసాన్ సమ్మాన్ నిధి ని పెంచుతామని ప్రగల్భాలు పలికారని.. అది కూడా మర్చిపోయారని ఆరోపించారు. గత 11 ఏళ్లలో తెలంగాణకు ఒక్క రూపాయి కేంద్ర నుంచి రావడం లేదని అన్నారు. రాష్ట్రంలో నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా.. నిధుల విషయంలో వారు ఏం చేశారో చెప్పాలన్నారు. 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారని.. ఆ విషయం ఏమైందని ప్రశ్నించారు.

లీటర్ పెట్రోల్ ధరను రూ.70 నుంచి రూ. 110కి పెంచింది మీరు కాదా అని రాంచందర్ రావును ఉద్దేశించి మాట్లాడారు. గ్యాస్ సిలిండర్ ధరను రూ.400 నుంచి రూ.1,100 చేసి నిరుపేదల నడ్డి విరిచారని ధ్వజమెత్తారు. విద్వేశ ప్రచారం, విధ్వంస చర్యలు, రాజకీయ నియంతృత్వం, ఆర్థిక వ్యవస్థలో కార్పోరేట్ల పెత్తనం, మత ఆధిపత్యం, కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న మోడీ హాయంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా ఇవ్వకుండా మోసం చేశారని, కృష్ణా జలాల్లో నీటి వాట తెల్చకుండా నాన్చుతుంది మీరు కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలను వంచించి.. ఒట్టి లేఖలు రాస్తే ప్రయోజనం లేదన్నారు. చేతనైతే ప్రధాని మోడీకి లేఖ రాసి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అంతే గాని ఏడాదిన్నర క్రితం ఏర్పాటైన ప్రజా ప్రభుత్వం అప్పుడే అన్ని చేసేయాలని ఇలా లేఖలు రాయడం మీ గుడ్డి ద్వేషానికి అద్దం పడుతోందని పొన్నం ప్రభాకర్ అన్నారు.

## పేదల ఇంటి కలకు బాసటగా ఇందిరమ్మ ఇళ్లు



తెలంగాణ రాష్ట్ర ప్రజలకు గృహ హక్కును హామీగా ఇచ్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఖమ్మం జిల్లా మధిరలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. దశాబ్దాలుగా గృహావసరానికి ఎదురుచూసిన పేదల కలలకూ ఈ రోజు ఆరంభమైందని ఆయన చెప్పారు.

ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత పాలకులు పేదల అభ్యున్నతిని పదే పదే వాయిదా వేసినప్పటికీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారి బలహీనతలను గుర్తించి న్యాయం చేయడానికి ముందుకు వచ్చిందన్నారు. పేదలకు ఇంటి ఆశ ఎక్కువ కాదని భావించిన గత పాలకుల వైఖరికి విరుద్ధంగా, తమ ప్రభుత్వం నిజమైన మార్పును తీసుకొచ్చిందని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం మొదటి ఏడాదిలోనే రూ.22,500 కోట్లు వెచ్చించడం దేశవ్యాప్తంగా ఒక మైలురాయిగా నిలుస్తుందని భట్టి వివరించారు. మొదటి దశలో నాలుగు లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, ఇందులో మధిర నియోజకవర్గం పెద్ద స్థాయిలో లబ్ధి పొందుతుందని తెలిపారు. ఇది ప్రజల జీవితాల్లో గౌరవభరితమైన మార్పును తీసుకువస్తుందన్నారు.

భట్టి విక్రమార్క తమ ప్రభుత్వ సంక్షేమ శ్రేణి గురించి మాట్లాడుతూ, రేషన్ బియ్యం, రూ.500 గ్యాస్ సబ్సిడీ, ఉచిత విద్యుత్, పెన్షన్లు, ఉపాధి హామీ, ఆరోగ్యశ్రీ, రైతు రుణమాఫీ, మహిళల కోసం వడ్డీ లేని రుణాలు వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని చెప్పారు. రాష్ట్రంలోని కోటి పది లక్షల కుటుంబాల్లో ఇప్పటికే 93 లక్షల కుటుంబాలకు ఈ పథకాలు అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, ఆయన నడిపే ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకే ప్రతిరూపంగా మారిందని భట్టి అన్నారు. “ప్రజల అవసరాలే మా విధానాలుగా మారుతున్నాయి. ఒక మనసున్న ప్రభుత్వం ఎలా ఉండాలో మేము స్పష్టంగా చాటి చూపిస్తున్నాం” అని ఆయన చెప్పారు.

# ప్రజల స్వేచ్ఛ కోసం.. అమెరికాలో మస్క్ కొత్త రాజకీయ పార్టీ

అమెరికాలో ప్రస్తుతం ప్రజాస్వామ్యం లేదని, ప్రజలకు స్వేచ్ఛ ఇచ్చేందుకే పార్టీ ఏర్పాటు చేశానని ఎలాన్ మస్క్ అన్నారు. ఈమేరకు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ‘మీరు కొత్త రాజకీయ పార్టీని కోరుకుంటున్నారు. అది మీకు లభిస్తుంది. ఈ రోజు మీకు మీ స్వేచ్ఛను



తిరిగి ఇవ్వడానికి అమెరికా పార్టీ ఏర్పడింది’ అని పోస్ట్ చేశారు. సోషల్ మీడియాలో వచ్చిన సూచనలకు సానుకూలంగా స్పందించిన మస్క్, ఎక్స్ వినియోగదారుల నుంచి సంపూర్ణ మద్దతు లభించడంతో ఈ నీర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

**ట్రంప్-మస్క్ మధ్య విభేదాలు..**

ట్రంప్ కలల బిల్లుగా చెప్పుకున్న వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు విషయంలో ఇద్దరి మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఈ బిల్లును మస్క్ మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. దీంతో ఈ బిల్లు కారణంగా మిత్రులు కాస్తా శత్రువులయ్యారు. ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. ఓ సందర్భంలో సామాజిక సంక్షేమ కార్యక్రమాలను తగ్గించి, అమెరికన్ల రుణాన్ని పెంచే ప్రజాదరణ లేని ఈ బిల్లుకు మద్దతు ఇచ్చే చట్ట సభ సభ్యులను పదవీచ్యుతులను చేస్తానంటూ మస్క్ వ్యాఖ్యానించారు.

ఈ బిల్లుకు ఆమోదం లభిస్తే మరుసటి రోజే తాను కొత్త పార్టీ పెడతానంటూ హెచ్చరించారు. ‘ప్రభుత్వ ఖర్చులను తగ్గించడం గురించి ప్రచారం చేసి.. ఇప్పుడు చరిత్రలో అతిపెద్ద రుణభారాన్ని పెంచే బిల్లుపై ఓటు వేసిన ప్రతి కాంగ్రెస్ సభ్యుడు సిగ్గుతో తల దించుకోవాలి. ఇప్పుడు ప్రజల గురించి ఆలోచించే కొత్త రాజకీయ పార్టీకి సమయం ఆసన్నమైంది. ఈ బిల్లు ఆమోదం పొందితే.. మరుసటి రోజే ‘ది అమెరికా పార్టీ’ ఏర్పడుతుంది’ అని మస్క్ హెచ్చరించారు. ఈ క్రమంలో అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా (జూలై 4) మస్క్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఒక పోల్‌ను నిర్వహించారు. ‘దాదాపు రెండు శతాబ్దాలుగా అమెరికా రాజకీయాలపై ఆధిపత్యం చెలాయిస్తున్న రెండు పార్టీల వ్యవస్థ నుంచి స్వాతంత్ర్యం కావాలా?’ అని అడిగారు. ఈ సర్వేకు 1.2 మిలియన్లకు పైగా స్పందనలు వచ్చాయి. దీని ఆధారంగా మస్క్ అమెరికా పార్టీని ఆరంభిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

# ఔదార్యానికి నిలువెత్తు నిదర్శనం

## కొత్తగూడెంలో ఛత్రపతి శివాజీ సేవా సంఘం మెగా కంటి శిబిరం



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, 06 జులై (ప్రజా పత్రిక): నిరుపేదలకు వైద్యం అందించడమే ధ్యేయంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం ఆధ్వర్యంలో, హైదరాబాద్ శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆదివారం ఏర్పాటు చేయబడింది. కూలీ లైన్ ప్రాంతంలోని పోషమ్మ దేవాలయ సమీపంలో నిర్వహించిన ఈ శిబిరానికి ప్రజలు భారీగా హాజరయ్యారు. ఈ శిబిరంలో సుమారు 378 మంది ప్రజలు కంటి సమస్యలపై వైద్య సలహాలు పొందగా, వారిలో 52 మంది కంటి ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. ఆయా రోగులను శస్త్రచికిత్సల కోసం హైదరాబాద్ శంకర కంటి ఆసుపత్రికి తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ, "నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే మా ముఖ్య ఉద్దేశం. ఇటువంటి ఉచిత శిబిరాలు ప్రజలలో ఆరోగ్య అవగాహన పెంచడంలో సహాయపడతాయి. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం" అని పేర్కొన్నారు.వైద్య శిబిరం విజయవంతం కావడంలో క్రియాశీలకంగా రేఖ రాజశేఖర్, పెద్దిరెడ్డి గోపి, గునిగంటి చందర్, నమ్మి జగదీష్, ఎమ్మునూరి శివ, సుంకు కనకరాజు, తెలంగాణ సురేష్, అత్తులూరి అరుణ్, వనమాల సుదర్శన్, నారాయణ సింగ్ ఠాకూర్, దామర్ల కరుణాకర్, ఈర్ల శ్యామ్, కుసుమ నవీన్, కపిల్ రాజు తదితరులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ముందున్నారు.ప్రజలు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ, నిర్వాహకులను హృదయపూర్వకంగా ప్రశంసించారు.




# ఉద్యమనాయకురాలు మంజుల ను పరామర్శించిన పకృతి కవి జయరాజు



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, 06 జులై (ప్రజా పత్రిక): మనం పత్రిక ఇంచార్జ్, జర్నలిస్ట్ జంపన్న సతీమణి జాడి మంజుల గత కొన్ని సంవత్సరాలనుండి గుండె, లివర్,సంబంధిత సమస్యలతో బాధపడుతున్న మంజుల ఆరోగ్య పరిస్థితి చూసి చలించిపోయాడు. ఉద్యమంలో అండగా ఉన్న వారేరి, ప్రజా ఉద్యమంలో, పార్టీలో, తోడుగా ఉన్నవారు ఎవరు.. నీకు ఆపద వస్తే ఆదుకునే వారెవరని బాధపడి, అలాగే అతనికి జరిగిన రోజులను గుర్తు చేసుకున్నారు. ఏది ఏమైనా నా వంతుగా హైదరాబాదులో ఉన్న గుండె డాక్టర్ని సంప్రదించి నిన్ను తీసుకెళ్తానని, తమ్ముడు జంపన్న కూడా ఎంతో కష్టపడి కళాకారుడిగా, తెలంగాణ ఉద్యమంలో పాటలు పాడిన సరైన గౌరవం దక్కలేదని, ఇప్పుడు జర్నలిస్టుగా పనిచేస్తున్నటువంటి తమ్ముడు ఇకముందు అయినా అన్ని పరిస్థితులని అర్థం చేసుకుంటూ ముందుకెళ్లాలని ఆశిస్తూ, మీ కుటుంబాన్ని అండగా ఉంటానని అన్నారు.

# పోడు భూములపై స్టే విధించిన హైకోర్టు



పినపాక, 06 జులై (ప్రజా పత్రిక): అశ్వాపురం మండలం పరిధిలోని చింతకుంట గ్రామంలోని 111 ఎకరాల పోడు భూమిలో గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న భూములపై ఫారెస్ట్ అధికారులు పట్టాలు ఇవ్వకుండా తొలగించడానికి ప్రయత్నం చేస్తున్నారని గిరిజనులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ భూములలో గిరిజనులను తొలగించరాదని, యధాతథంగా ఉంచాలని హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసిందని హై కోర్ట్ అడ్వకేట్ తెలియజేశారు. దీనితో గిరిజన రైతులకు కొంత ఊరట కలిగింది.

# కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి

**కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి**

**కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను బిజెపి వీడనాడాలి.**

**జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం కదం తొక్కాలి....**

**-తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి**



మోత్కూర్ 06జూలై (ప్రజా పత్రిక): కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలో ని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పోరేట్ అనుకూల, మతోన్మాద చర్యలకు పాల్పడుతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి గారు అన్నారు. ఆదివారం మోత్కూర్ పట్టణ కేంద్రంలో కూలీలతో మాట్లాడుతూ కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాల్లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందన్నారు. కార్మిక వర్గం అనేక పోరాటాల ఫలితంగా లేబర్ కోడ్ లు అమలుకు ఆలస్యం అయినా ప్రస్తుతం వాటిని అమలు చేసి కార్మిక వర్గం హక్కులను హరించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. 2025 బి26 బడ్జెట్ లో కార్పొరేట్ అనుకూల విధానాలకు అనుగుణంగా కేటాయింపులు చేసిందన్నారు. సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టిందన్నారు. సామాన్యులపై బారాలు మోపి, కార్పొరేట్ గుత్త సంస్థలకు, పెట్టుబడుదారులకు ఐదు వేల కోట్లు రాయితీ ప్రకటించింది అన్నారు. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలు పట్టించుకోలేదన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కార్మిక వర్గం ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రోజురోజుకు నిర్వీర్యం చేస్తుందని అన్నారు. వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సమగ్ర శాసన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాచకొండ రాములమ్మ, మెతుకు అంజయ్య, తీగల సావిత్రమ్మ, గుండు లక్ష్మి, బొల్లు రంగమ్మ, జి నవనీత, వల్లాల అనసూయ, శోభ తదితరులు పాల్గొన్నారు

# కొత్త జిల్లాలకు తహసీల్దార్ ,ఇతర కార్యాలయాలకు అదనపు పోస్టులు మంజూరు చేయాలి : ఎంపీ ఆర్‌కృష్ణయ్య



న్యూస్ డెస్క్, 06 జులై (ప్రజా పత్రిక): కొత్త జిల్లాలు తహసీల్దార్, ఇతర కార్యాలయాలకు అదనపు పోస్టులు మంజూరు చేసి ఉద్యోగుల కొరత లేకుండా చూడాలని బీసీ సంక్షేమ శాఖ జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్?.కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సీఎం రేవంత్?రెడ్డికి లేఖ రాశారు. ఈసందర్భంగా వివరిస్తూ 2017లో మున్సిపల్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ లు, గ్రామా పంచాయతిలు ఏర్పాటు చేయడం జరిగిందని వాటికి అవసరమైన అదనపు పోస్టులు సృష్టించలేదని దీంతో మిగతా ఉద్యోగులు అదనపు బాధ్యతలతో విధులు నిర్వహించాల్సి వస్తోందన్నారు. కొత్తగా ఏర్పడ్డ 23 జిల్లాలోని వాటిలో 40 శాఖల జిల్లా ఆఫీసులు, తాలూకా ఆఫీసులు ఏర్పడ్డాయి. 131 మండలాలు, 30 రెవెన్యూ డివిజనల్ ఆఫీసులు, 76 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పోరేషన్లు, 25 డీఎస్పీ ఆఫీసులు, 31 పోలీస్ సర్కిల్స్, 7 పోలిస్ కమిషనరేట్లు, 4,383 గ్రామపంచాయతీలు కొత్తగా ఏర్పాటు చేశారని తెలిపారు. ఇందులో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-4 సర్వీస్ పోస్టులు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయి. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు, మండలాలకు మున్సిపాలిటీలకు కొత్త పోస్టులు మంజూరు చేయలేదు. వీటిని వెంటనే మంజూరు చేయాలని కోరారు. గ్రూప్-1లో 50 శాతం, గ్రూప్-2 లో 30 నుంచి 40 శాతం డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోటా కింద ఎన్ని పోస్టులు వస్తాయో పూర్తి స్థాయిలో లెక్కించి భర్తీ చేయాలని సూచించారు. ప్రస్తుత పద్ధతి ప్రకారం ఇతర అభ్యర్థులకు రాకుండా పోతాయని వెయిటింగ్ లిస్టు, ఆప్షన్ పద్ధతి లేదు. అందుకే ఆప్షన్ పద్ధతి, వెయిటింగ్ లిస్టు కాల పరిమితి ప్రవేశపెట్టి పోస్టుల భర్తీ చేస్తే అందరికీ అవకాశం వస్తుంది. పోస్టులు మిగిలిపోకుండా భర్తీ అవుతాయని తెలిపారు. యువతరాన్ని డైరెక్టు రిక్రూట్ మెంట్ ద్వారా ప్రభుత్వ యంత్రాంగంలోకి తీసుకువస్తే సమర్థవంతమైన, అవినీతికి తావులేని పాలన లభిస్తుందన్నారు. యువతను పాలనరంగం లోకి తీసుకువస్తే ఉత్సాహంతో, అంకిత భావంతో నిజాయితీగా పని చేస్తారని గుర్తు చేస్తారు.


# కుక్కను ఢీకొని ఆగిపోయిన వందే భారత్



న్యూస్ డెస్క్, 06 జులై (ప్రజా పత్రిక): వందే భారత్ ఎక్స్‌ప్రెస్.. భారత రైల్వేల 'స్పీడ్ స్టార్', అత్యాధునిక సౌకర్యాలతో గంటకు 160 కి.మీ. వేగంతో దూసుకెళ్లే ఈ రైలు నేడు ఒక కుక్కను ఢీకొట్టి ఆగిపోయింది. బాపట్ల జిల్లాలోని చీరాల వద్ద విజయవాడ నుంచి చెన్నై వెళ్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నేడు కుక్కను ఢీకొట్టడంతో ఎయిర్ బ్రేక్ వ్యవస్థకు అంతరాయం ఏర్పడి 27 నిమిషాల పాటు నిలిచిపోయింది. ఈ ఘటన రైలు యొక్క సాంకేతిక సంక్లిష్టతను తెలియజేస్తూ, చిన్న ఢీకొనడం కూడా ప్రయాణంలో ఆటంకం కలిగించగలదని సూచిస్తుంది. రైల్వే సిబ్బంది వెంటనే సమస్యను పరిష్కరించి, రైలును తిరిగి ప్రారంభించారు. అయితే ఈ సంఘటన ప్రయాణీకులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగించింది. అయితే అంతకముందు విశాఖ నుంచి సికింద్రాబాద్ వస్తున్న వందే భారత్ ఎక్స్ ప్రెస్ వరంగల్ లోని తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఎద్దును ఢీకొట్టి నిలిచిపోయింది.

ఈ ఘటనలో రైలు ఇంజిన్ ముందు భాగం దెబ్బతిన్నది. ఈ ఘటనలపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. "అది కుక్కైనా, ఎద్దైనా.. ప్రాబ్లమ్ మాత్రం వందే భారత్‌కే! దాని వేగం కంటే సమస్యలు వేగంగా దూసుకొస్తున్నాయని సోషల్ మీడియాలో నెటిజన్లు సెటైర్లు విసురుతున్నారు. ఇది రైలు డిజైన్‌లోని లోపమా, లేక రైల్వే భద్రతా చర్యల్లో లోటా? వందే భారత్ రైళు తేలికైన EMU డిజైన్‌తో రూపొందాయి. కానీ ఈ డిజైన్ జంతువుల ఢీకొనడం వల్ల సులభంగా దెబ్బతినేలా ఉంది. దీనిపై విమర్శలు చేస్తూ.. వందే భారత్‌ను 'సూపర్‌ఫాస్ట్' కాకుండా 'సూపర్ సెన్సిటివ్'గా మార్చాయని ఎద్దేవా చేస్తున్నారు.

# "నాన్నా.. ఓ ఉద్యోగిని ప్రేమించాను.. ఆయన దగ్గరకు వెళ్తున్నా".. ఓ మైనర్ బాలిక లేఖ



న్యూస్ డెస్క్, 06 జులై (ప్రజా పత్రిక): నవాబుపేట మండలంలో హృదయవిదారక ఘటన చోటు చేసుకుంది. ఓ మైనర్ బాలిక ప్రేమ పేరుతో ఇంటి నుండి ఎటోవెళ్లిపోయి అందరినీ కలవరపర్చింది. ముక్కుపచ్చల్లారని మైనర్ బాలిక ఓ వ్యక్తి ప్రేమలో పడి, ఆ వ్యక్తి మాయమాటలు నమ్మి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇల్లు విడిచి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక డిగ్రీ చదవడానికి మహబూబ్‌నగర్ పట్టణంలోని ఓ కళాశాలలో చేరింది. వచ్చే సోమవారం రోజున ఆమె జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రిలోని వసతి గృహానికి వెళ్లాల్సి ఉండగా, శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తల్లిదండ్రులకు తెలియకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. సాయంత్రం వరకు ఇంటికి తిరిగిరాకపోవడంతో తల్లిదండ్రులు ఆమెను గాలించగా ఆమె గదిలోని పుస్తకాల మధ్య ఓ లేఖ కనిపించింది. అందులో తాను ఓ ఉద్యోగిని ప్రేమిస్తున్నానని, అతనిని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నానని, చదువు కొనసాగించకూడదని, ఫార్మసీ కోర్సు చేయాలనుకుంటున్నానని రాసి ఉంది.

లేఖతో పాటు ఆమె స్టడీ సర్టిఫికెట్లు కూడా గల్లంతైనట్లు తల్లిదండ్రులు గుర్తించారు. ఈ ఘటనపై తీవ్ర ఆందోళనకు గురైన బాలిక తండ్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్సై ఎం.విక్రమ్ దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఇదే మండలంలో ఇటీవలి కాలంలో మైనర్ బాలికల అదృశ్య ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో, తల్లిదండ్రుల మధ్య ఆందోళన నెలకొంది. పోలీసులు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, ఇలా సంఘటనలు జరుగుతుండడం భద్రతాపరమైన సమస్యలపై పలు ప్రశ్నలు కలిగిస్తోంది. ఈ ఘటనల మిస్టరీలను ఛేదించి, సమాజంలో భరోసా కల్పించాల్సిన బాధ్యత ఇప్పుడు పోలీసులదే కావాలంటూ స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# సినిమా న్యూస్

## లక్కీ భాస్కర్ కు సీక్వెల్ చేస్తా.. వెంకీ అట్లూరి క్లారిటీ



రీసెంట్ గా వచ్చి భారీ హిట్ అయిన సినిమాల లిస్టులో లక్కీ భాస్కర్ కచ్చితంగా ఉంటుంది. మొదట్లో పెద్దగా అంచనాలు లేకుండా వచ్చి విమర్శకుల ప్రశంసలు అందుకుంది ఈ సినిమా. దుల్కర్ సల్మాన్ హీరోగా వెంకీ అట్లూరి డైరెక్షన్ లో వచ్చింది ఈ మూవీ. సామాన్యుడు గెలిస్తే ఎలా ఉంటుందో రుచి చూపించింది ఈ మూవీ. దీనికి సీక్వెల్ రావాలంటూ ఎప్పటి నుంచో ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. దానిపై క్లారిటీ ఇచ్చారు వెంకీ అట్లూరి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వెంకీ అట్లూరి దీనిపై ప్రశ్న ఎదురవగా స్పందించారు. లక్కీ భాస్కర్ అనేది అరుదైన స్క్రిప్ట్. దాన్ని టచ్ చేయాలంటే చాలా లోతుగా స్టడీ చేయాల్సి ఉంటుందన్నారు.

నేను లక్కీ భాస్కర్ మూవీ తీసినప్పుడే దానికి సీక్వెల్ చేయాలని ఫిక్స్ అయ్యాను. కాకపోతే ప్రేక్షకుల ఆదరణను బట్టి అది డిసైడ్ చేయాలనుకున్నా. అనుకున్నట్టే లక్కీ భాస్కర్ పెద్ద హిట్ అయింది. ఇప్పుడు దానికి సీక్వెల్ చేయాలనే డిమాండ్స్ ప్రేక్షకుల నుంచి వస్తున్నాయి. కచ్చితంగా సీక్వెల్ ఉంటుంది. దానికి కొంచెం టైమ్ పడుతుంది కావచ్చు' అంటూ చెప్పుకొచ్చారు వెంకీ అట్లూరి. అతను చేసిన కామెంట్లు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. లక్కీ భాస్కర్ భారీ హిట్ తో వంద కోట్ల మైలురాయిని అందుకుంది. వెంకీ అట్లూరి ప్రస్తుతం సూర్యతో సినిమా చేస్తున్నాడు. దీన్ని భారీ బడ్జెట్ తో చేస్తున్నారు.

## నాకొక ఐడెంటిటీ ఇచ్చారు..

**: స్టేజ్‌పై సమంత ఎమోషనల్**

నటి సమంత తానా వేడుకల్లో పాల్గొన్నారు. అభిమానులు చూపిస్తోన్న ప్రేమ పట్ల భావోద్వేగానికి గురయ్యారు. "తానా వేడుకల్లో పాల్గొనడానికి 15 ఏళ్లు పట్టిందంటే నమ్మలేకపోతున్నా. ప్రతి ఏడాది తానా, ఇక్కడ ఉన్న తెలుగువారి గురించి వింటూనే ఉంటాను. నా తొలి చిత్రం 'ఏమాయ చేసావె' నుంచి నన్ను మీ మనిషిలా భావించారు. నాపై ప్రేమను చూపించారు. మీ ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు చెప్పడానికి నాకు ఇన్ని ఏళ్లు పట్టింది" అంటూ శిరస్సు వంచి నమస్కారం చేశారు.

"కెరీర్ పరంగా ముఖ్యమైన దశలో ఉన్నాను. ట్రాలాలా పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించా. నిర్మాతగా 'శుభం'తో తొలి అడుగు వేశా. నార్త్ అమెరికాకు చెందిన తెలుగువారు మా చిత్రాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు. మంచి ఫలితాన్ని అందించారు. జీవితంలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. ఏదైనా తప్పు చేసినా.. మీరు ఎప్పుడూ నా వెంటే ఉన్నారు. అందుకు గర్వపడుతున్నా. ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా, ఏ పరిశ్రమలో పనిచేసినా.. 'తెలుగు ప్రేక్షకులు నన్ను చూసి గర్వపడతారా? లేదా?' అనే ఆలోచిస్తాను. ఇన్నేళ్ల ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలు. మీరు నాకొక ఐడెంటిటీ, కుటుంబాన్ని ఇచ్చారు. 'ఓబేబీ' మిలియన్ డాలర్ క్లబ్‌లోకి చేరడం మీవల్లే సాధ్యమైంది. ప్రాంతాలను బట్టి మీరు నాకు దూరంగా ఉండొచ్చు.. కానీ మీరెప్పటికీ నా మనసులోనే ఉంటారు" అంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. కంటతడి పెట్టుకున్నారు.



## వెంకీ సరసన ఆ క్రేజీ బ్యూటీ..?



విక్టరీ వెంకటేష్ ఇప్పుడు ఫుల్ జోష్ లో ఉన్నాడు. సంక్రాంతికి వస్తున్నాం మూవీ భారీ హిట్ అయింది. దీని తర్వాత త్రివిక్రమ్ తో మూవీ చేస్తున్నాడు. వీరిద్దరి కాంబినేషన్ లో వస్తున్న ఈ సినిమాను భారీ బడ్జెట్ తో తీస్తున్నారంట. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు స్టార్ట్ అయినట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్ తో చేసే సినిమా కంటే ముందే వెంకీ మూవీని కంప్లీట్ చేయాలని త్రివిక్రమ్ భావిస్తున్నారంట. ఈ సినిమాలో హీరోయిన్ కోసం ఓ ముగ్గురి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఇందులో చూసుకుంటే త్రిష, రుక్మిణీ వసంత్, నిధి అగర్వాల్ పేర్లు ఉన్నాయి. త్రిష, వెంకీ ఇప్పటికే కలిసి సినిమాలు చేశారు. కాబట్టి త్రిషను తీసుకునే అవకాశం లేదని అంటున్నారు.

ఇప్పుడు రుక్మిణీ వసంత్ పేరు ట్రెండింగ్ లో ఉంది. కానీ వెంకీ సరసన ఆమె కంటే నిధి అగర్వాల్ సెట్ అవుతుందని భావిస్తున్నారంట. పైగా హరిహర వీరమల్లు మూవీకి త్రివిక్రమ్ కొంత హెల్ప్ చేశారు. ఆ టైమ్ లోనే నిధితో మంచి సాన్నిహిత్యం ఏర్పడిందంట. నిధి అగర్వాల్ ఈ సినిమాలో పాత్రకు సెట్ అవుతుందని గురూజీ భావిస్తున్నారంట. అన్నీ కుదిరితే త్వరలోనే మూవీ షూటింగ్ స్టార్ట్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీరమల్లు మూవీ జులై 24న రిలీజ్ కాబోతోంది. అది పెద్ద హిట్ అయితే నిధికి అవకాశాలు పెరగడం ఖాయం అంటున్నారు ఆమె ఫ్యాన్స్.

## కాక్‌టెయిల్ 2 కోసం..

త్వరలో 'తేరే ఇష్క్ మే' చిత్రంతో ప్రియుడి కోసం పోరాటం చేసే ఓ ప్రేమి కురాలిగా ప్రేక్షకుల్ని పలకరించనుంది బాలీవుడ్ తార కృతి సనన్. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపింది చిత్రబృందం. ఇప్పుడామె తన తదుపరి ప్రాజెక్టు కోసం రంగంలోకి దిగనున్నట్లు సమాచారం. కృతి, షాహిద్ కపూర్ జంటగా 'కాక్‌టెయిల్ 2' చిత్రంలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. రష్మిక కీలక పాత్ర పోషిస్తుంది. హోమీ అదజానియా దర్శకుడు. తాజాగా ఆగస్టులో ఈ సినిమా షూటింగ్‌ను మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ మొదటి షెడ్యూల్‌లో కృతి భాగం కానున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. మడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రం 2026లో విడుదల కానుంది.